# తప్పెవరిది?

-యలమర్తి అనూరాధ

**సూర్యు**డు చాలా కోపంగా ఉన్నట్లున్నాడు. ఆ కోపా న్నంతా సకల జనాల మీద చూపిస్తూ చండ ప్రచండంగా విరుచుకు పడుతున్నాడు. అతనిని అలా చూసి ప్రకృతి కూడా విలవిలలాడింది. కాలం కాని కాలంలో ఈ విపత్తు ఏమిటా అని!

అలాంటి సమయంలో ఆయనకు నేనేం తక్కువ కాదు అన్నట్లు 'ప్రకాశరావు' బెల్ట్ తీసుకొని తన సుపుత్రుడు 'వినయ్'ని వీరబాదుడు బాదుతున్నాడు. ఆ దెబ్బలకు ఆ పసి శరీరం చీలి రక్తమొస్తున్నా ఆయన కొట్టడం ఆపటంలేదు. ఆ దృశ్యాన్ని చూడలేక, భర్తకు అడ్డుచెప్పలేక విలవిలలాడుతోంది 'విమల' తల్లి హృదయం. మరి వాడు చేసిన పని చిన్నదేమీ కాదు.

'వినయ్' చిన్నతనం నుంచీ పేరుకు తగ్గట్లు ఎంతో వినయంగా ఉండేవాడు. ఎంతసేపూ చదువు ధ్యాసే! ఆటలకు, స్నేహితులకు చాలా తక్కువ సమయాన్ని కేటా యించేవాడు. బుద్ధిమంతుడిలా చదువుకొనే అతన్ని చూసి మురిసిపోనివారు లేరు ఆ ఊరిలో. చదువుల తల్లే అతని ఒడిలో ఒదిగి పోయినట్లుండేది. అందుకే అందరి ప్రశంసలను అందుకుంటూ ఉండేవాడు.

ఇంటికెవరయినా అతిథులు వచ్చినా ఒక్క అయిదు నిముషాలు వాడితో మాట్లాడి 'ప్రకాశరావు'ను కేకలేసే వారు. ఏదైనా మంచి స్కూలులో చదివించమని. ఇక్కడ ఈ చిన్ని ఊరులో వాడి తెలివితేటలు మరుగున పడిపోతు న్నాయని. వాడిని బయటకు పంపితే మట్టిలో మాణి క్యంలా మెరిసిపోతాడని.

తినగ తినగ వేమ తియ్యన అన్నట్లు ఇలా అందరూ పదే పదే అనటంతో ఆయన ఆలోచనలో పడ్డారు. వీపునిండా కేజీల కేజీల బరువులు, రుద్దుడు కార్యక్రమం చేపట్టిన ఎన్నో స్కూళ్ళు ఆయన కళ్ళముందు కనబడ్డాయి. కానీ అలాంటి వాటిలో తన బిడ్డను చేర్చి కష్టపెట్ట దలుచుకోలేదు. స్కూలు స్టాండర్డ్ బాగుండి పిల్లలను మంచిగా ట్రీట్ చేస్తూ పేరు తెచ్చుకొన్న వాటి కోసం వెతకటం ప్రారంభించాడు. అలాంటివి ఎక్కడో ఒకటో రెండో. అదీ పేరుమోసిన పట్టణాలల్లోనే! సరే! పంపా లనుకున్నాక దూరమని వెనకాడితే ఎలా? పోనీ తనూ పట్టణం వెళ్ళాలంటే పొలాలు ఎవరు చూస్తారు? ఈ పంట తల్లిని వదిలి తను ఉండలేడే! అలా అని బిడ్డ భవిష్యత్తును చూడకపోతే ఎలా? సరే! చివరకు పట్టణానికి పంపాలనే నిశ్చయించుకున్నాడు. ఆయన నిశ్చయం బాగానే ఉంది. కానీ విమల ఎదురు తిరిగింది.

'ఒక్కగానొక్క కొడుకు. వాడిని విడిచి నేనుండలేను. మన ఊరిలో ఏ చదువు ఉంటే అదే చదువుతాడు. వాడికి రాసి ఉంటే, కష్టపడితే ఎక్కడయినా వెలుగులోకి వస్తాడు. ఇప్పుడు ఏ టాప్ రాంకర్స్‌ని చూసినా వాళ్ళంతా పల్లెల లోంచి వచ్చిన వాళ్ళే. నా కొడుకుని నేను పంపటానికి ఇష్టపడను' అని ఖరాఖండిగా చెప్పేసింది.

ఆమెను ఒప్పించటానికి ఎన్నో రోజులు పట్టాయి. చివరకు మనసు రాయి చేసుకొని బిడ్డను పంపించటానికి ఒప్పుకుంది.

తీరా చూస్తే ప్రకాశరావు ఎంచుకున్న 'జ్ఞానోదయ స్కూలు'కి హాస్టల్ వసతి లేదు.

ఏం చెయ్యాలి? ఈ ఊరిలో తనకు స్నేహితులు లేరు, బంధువులు లేరు. వినయ్‌ని ఎక్కడ ఉంచి చదివిం చాలి. అతని ఆలోచనలను గమనించినట్లే అక్కడ పనిచేస్తున్న క్లర్క్ 'ప్రక్కనే 'స్టూడెంట్' అనే హాస్టల్ ఉంది సార్. అందులో ప్రయత్నించండి. మంచి పేరుంది. ప్రక్క వీధిలోనే!'

నడిసముద్రంలో మునిగిపోతున్న వాడికి ఒడ్డు చేరడానికి తెప్ప దొరికినంత ఆనందమేసింది ఆయనకు ఆ క్షణాన. వెంటనే అక్కడకు వెళ్ళాడు. శుచిగా, శుభ్రంగా ఉన ఆ వాతావరణం చూసి ఆయన ఎంతో ముచ్చట పడ్డాడు. ఇక ఆలోచించకుండా 'కేర్ టేకర్'ని కలిసాడు. కానీ ఆయన అంత చిన్న పిల్లవాడిని చేర్చుకోవటానికి ఇష్టపడలేదు. అయినా స్పెషల్ కేస్ క్రింద తీసుకోమని కోరటంతో పెద్దాయనను కాదనలేక చేర్చుకున్నాడు. అలా పట్టణ జీవితంలో పడ్డాడు వినయ్! అంతే కాదు. చిన్న బావిలోంచి విశాలమైన నదిలోకి వచ్చినట్టు కూడా అనిపించింది. అక్కడ విలాసాలు, విచ్చలవిడిగా డబ్బును ఖర్చుపెట్టే విద్యార్థులు అంతా వింతగా అనిపించేవి. ఆ వింతను తను కూడా అనుభవించాలనే చిన్న కోరిక ఫుల్‌స్టాప్‌లా ప్రారంభమయి కామాలా పెరిగి సున్నాలా తయారయి అతన్ని శూన్యంలోకి నెట్టేసింది.

ఒక రోజు స్కూలు నుంచీ వస్తూ "కేర్ కంప్యూ టర్స్"లోకి సరదాగా వెళ్ళాడు. అక్కడ వరుసకు పది కంప్యూటర్స్. అలా అటువైపు, ఇటువైపు కలిపి మొత్తం నలభైదాకా ఉండటం వాటి ముందు అందరూ ఆడుకోవ టం చూసి అతనికీ ఆడాలనిపించింది. అక్కడంతా డబ్బుతోనే. మొదటిసారి పాతిక రూపాయలతో ఒక గంట 'గేమ్' ఆడాడు. ఆ తర్వాత ఇంకో గంట.. అలా.. అలా.. ఇంకా ఇంకా ఆడాలనిపించేది. అమ్మా నాన్న పంపిన అయిదు వందలు అయిపోయింది. అన్నా ఒక వంద ఇవ్వవా అంటూ హాస్టల్‌లో ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర అలా అందరి దగ్గిర కలిపి వెయ్యి పైనే అప్పు చేశాడు. ఇంకా అప్పు చేసే ఉద్దేశంతోనే ఉన్నాడు.

మూడు నెలలు అయిందని కొడుకును చూసిపోదా మని వచ్చిన ఆ దంపతులకు పెద్ద షాక్. నెల నుంచీ అతను స్కూలుకు రావటం లేదని చెప్పటంతో అచేతను లయ్యారు. ఆ తర్వాత విషయాలు ఒక్కొక్కటీ తెలిసి వచ్చాయి. ఆ కోపాన్ని ఆపుకోలేక ఆయన 'బెల్ట్'కి పని పెట్టారు.

పట్టణ సంస్కృతి బాగోలేదని ఎందరు చెబుతున్నా తన పెంపకాన్ని నమ్మి ఇక్కడ పెట్టినందుకు తనకు మిగి లిందేమిటి? 'వ్యసనంలా' మారిన ఈ గేమ్స్ నుంచీ తన కొడుకును కాపాడుకునేది ఎలా? పోనీ తీసుకొని వెళ్ళి పోతే అది సరైన పరిష్కారంలా అనిపించలేదు. కాసేపు ఆలోచించి ఆ 'కేర్ కంప్యూటర్స్'కి వినయ్‌ని తీసుకు వెళ్ళాడు. 'రేపటి నుంచీ మా బాబును రానివ్వకండి' అని చెప్పాడు.

"మీరు చెప్పారుగా అలాగే! కానీ ఇలా ఓ వెయ్యి మంది తల్లిదండ్రులు మాకు చెబుతారు. మేం మీరు చెప్పినట్లు వింటే మా వ్యాపారం ఏమవుతుంది?" అతని సూటి ప్రశ్న.

అందుకని విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలా?

"మీకు వెయ్యి మంది.. కానీ మాకు ఒక్కడే.. తల్లితండ్రులిగా మేమిలా చెప్పకుండా ఉండలేం అని వెనుతిరిగాడు. అసలిలాంటి వాటికి లైసెన్సు ఎలా ఇస్తారు? స్కూల్స్‌కి అతి దగ్గరగా, వయసుతో సంబంధం లేకుండా అందరికీ ఆహ్వానమే. చేతిలో ధనలక్ష్మి ఉంటే చాలు. ఇలాంటి వాటి వల్ల దొంగతనాలు కూడా పెరుగుతాయ్!

దూరపు కొండలు నునుపని భ్రమపడి తప్పు చేశాడా? బుద్ధిమంతుడైన వినయ్ గేమ్స్‌కి అలవాటు పడి తను తప్పుచేశాడా? వాళ్ళ మీద సరైన కంట్రోల్ లేకుండా స్కూలుకు వెళ్ళాడనుకుంటా అని దాటవేసిన కేర్ టేకర్‌ది తప్పా?

తప్పు ఎవరిది?

ఆలోచనలలోనే కాదు... ఆయన అడుగులు కూడా తడబడుతున్నాయి. ఆయన కళ్ళ ముందు ఎందరో చిన్నారులు– యువత.. తెరలు.. తెరలుగా..

❖ ❖ ❖

*(కంప్యూటర్ గేమ్స్‌కి అంకితమవుతున్న ఎందరో విద్యార్థులలో ఒక్కరికైనా కనువిప్పు కలిగించాలని.. అలాంటి వారికే ఈ కథ అంకితం.)*

## స్నేహితుడి రాకతో

**చి**రకాలానంతరం
చిననాటి స్నేహితుడొకడు
తల వాకిట ప్రత్యక్షమై
అమితాశ్చర్యానికి గురిచేశాడు
ఎదురు చూడని యీ హఠాత్సంఘటనతో
మొదట మెదడు మొద్దువారింది
పిదప మాట మూగవోయింది
క్షణకాలం నిశ్శబ్ద తాండవం
వెంటనే తేరుకున్న మెదడు
వెనువెంటనే మాటల మీట నొక్కింది
మమతలనద్దుకున్న మాటలు
చినుకులుగా రాలాయి
చిననాటి స్నేహితుణ్ణి
పరామర్శలతో తడిపాయి
స్నేహితుని రాకతో మా యింటిలో
పాత జ్ఞాపకాల మయూరాలు
పురులు విప్పి నాట్యం చేశాయి
ఆనంద హాసాల ప్రసూనాలు
రేకులు విప్పి పరిమళించాయి
మమతాను రాగాల గీతాల
గొంతులు విప్పి గానం చేశాయి

-జి.నీలకంఠం